
# చల్లని నీడలో నిప్పురవ్వలు

గౌతమ్



సరిగా ఏడాది తర్వాత మళ్ళా యింటికి వెళ్తున్నాను. యుద్ధం ముగిసి శాంతి నెలకొనడంతో ఆ భయానక వాతావరణం, గుండెలుకోసే దృశ్యాలూ తెరమరుగున పడ్తున్నాయ్. అగ్నిగుండంలో నుంచి బయటకు నడిచి చల్లని నీడకోసం యింటికి పరుగెడ్తున్నాను. రైలు స్టేషన్‌లో ఆగంగానే నాకోసం ఎదురు చూస్తున్న వాళ్లంతా చుట్టుముట్టేశారు నన్ను.

మనసు హాయితో నిండిన చిరునవ్వులో, ఆప్యాయత కురిపించే కౌగిలింతలో, కరచాలనాలో ఊపిరి సలపలేదు. దగ్గరగా నుంచుని మెరిసే కళ్లతో నన్ను నిలువునా పరికిస్తోంది నా కాబోయే శ్రీమతి రాధ. చిరుకుపోయి గిట్టుపడిన కణతల్ని తన చల్లటి చేతితో తడిమి కన్నీరు నింపుకుంది అమ్మ. చెల్లాయ్ సంబరానికి హద్దేలేదు. తన పటాలం అందర్నీ తీసుకొచ్చిందేమో వాళ్లంతా వచ్చి పూలమాలలో ముంచేశారు నన్ను.

ఎలాగయితేనేం కార్లో యింటికి ప్రయాణమయ్యాం. 'రోజూ పేపర్లో వార్తలు చదివి నీగురించి ఎంత గాబరా పడేవాళ్లమో అంతా!' అంటూ వివరించారు నాన్న.

'నీకెక్కడ ప్రమాదం జరుగుతుందో అని రాత్రింబవళ్లు కుమిలిపోయాన్రా బాబూ' అమ్మ ఆవేదనతో అంది.

అందరి ముఖాల్లో నేను సజీవంగా తిరిగి వచ్చినందుకు కలిగిన ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది. చెల్లాయ్ ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక ఏకాసంగా వుండిపోయాను. నన్ను తన కళ్లలో నిలుపుకోవడమే ధ్యేయమున్నట్లుగా చూస్తోంది రాధ. యీ సందడిలో తెలియకుండానే యిల్లు చేరుకున్నాం.

మధ్యాహ్నం డైయింగ్‌రూంలో కూర్చుని కబుర్లు మొదలుపెట్టాం.

'యుద్ధం జరిగినప్పుడు మీరెక్కడున్నార్రా?' నాన్న అడిగారు.

'మా బెటాలియన్ దినాజ్‌పూర్ ప్రాంతంలో యుద్ధం చేశాం నాన్నా'

'అక్కడ పోరాటం బాగా తీవ్రంగా జరిగినట్లు విన్నానే?'

'ఏమో నాకంతగా అనిపించలేదు. ఇదే కదా నేను మొదటిసారి యుద్ధంలో

పోల్చోనడం. కాని చాలామంది చనిపోయాదక్కాడ' అన్నాను నెమ్మదిగా.

'యుద్ధం బాగా ఘోరంగా వుంటుంది కదూ?' రాధ అనుమానం.

'అది మామూలే — కాని అంతమంది చావుకు గురి కాకుండావుంటే బావుండేది. అదే నా బాధ.'

'మీరు క్షేమంగా ఎప్పుడు తిరిగివస్తారా అని ఎదురు చూస్తూనే గడిపాం యిన్ని రోజులూ. యింట్లోనుంచి కదలకపోవడంతో తిండి ఎక్కువయింది. కొంచెం లావెక్కాను కదూ?' నవ్వుతూ అడిగింది రాధ.

'యీలావుతోపాటు అనీమియావచ్చిపడుతుందేమో అని నా భయం' అమ్మ కామెంట్.

ఆ మాటల్తో నాకు నవ్వూ, బాధా ముంచుకొచ్చినాయ్. నేను తిరిగినచోటల్లా ఆకలితో నకనకలాడని మనిషి లేడసలు. ఓరకంగా ఆకలి మనిషిని జంతువుగా మారుస్తుందని చెప్పచ్చు. ఓ సంఘటన జ్ఞాపకం వచ్చి చెప్పకొచ్చాను.

'యుద్ధం అయిపోయిన తర్వాత ఓ రిలీఫ్ కాంప్‌కి వెళ్ళాన్నేను. ఏ మనిషి ముఖంలో చూసినా ఆకలి తాండవమాడుతూండేది. తిండిపెట్టే రెండుగంటల ముందుగానే లైన్‌లో కూర్చునేవాళ్ళు. వంటపాకనుంచి వచ్చే వాసనలు మ్రింగుతూ ఎదురుచూసే వాళ్ళు. తిండి పంచిపెట్టగానే రెండునిముషాల్లో తినేసి మళ్ళీ భోజనం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూసేవాళ్ళు.'

'ముసలీ—ముతకా ఎలా తట్టుకునే వాళ్ళురా?' తన సందేహం బయట పెట్టింది అమ్మ.

'ముసలివాళ్ళయితే వాళ్ళదాకా వస్తేనే తినేవాళ్ళుగాని, తిండికోసం ఎగబడేవాళ్ళు కాదు. లైన్‌లో కూర్చునే ఆకలితో కన్నుమూసిన వాళ్ళు ఎంతమందో!'

'అబ్బ—అవన్నీ చెప్పకురా బాబూ— నాకు గుండెదడ పట్టుకుంటుంది' అంది అమ్మ కాఫీ తీసుకు రావడంకోసం లోపలికి వెళ్తూ.

మళ్ళీవచ్చి, అమ్మ 'యింక నువ్వు జాప్యంచేస్తే లాభంలేదురా బాబూ—యీ సెలవులోనే పెళ్ళి జరిగితీరాలి' పట్టుదలగా అంది.

యుద్ధం రాకముందు నాకూ త్వరగా పెళ్ళిచేసుకోవాలనే వుండేది. కానీ యిప్పుడు మనసు వికలమయిపోయింది. జరిగిన సంగతులు తల్చుకుంటే భయం భయంగా అన్పిస్తోంది. చిన్నప్పుడు వీధిలో మోసుకుపోయే శవాల్ని, అమ్మకి తెలియకుండా కిటికీ చాటునుండి చూడటమే తప్ప చావంటే నాకు తెలియదు. కానీ నాతోపాటు పోరాడిన వాళ్ళెంతమంది నా ప్రక్కనే నేలకొరగడం చూశాను. వాళ్ళు చంపిన వందలాది మనుషుల్ని చూశాను. కాళ్ళూ, చేతులూ తెగినవాళ్ళూ, సగంకాలిన శవాలూ. చివరి క్షణాలు భయంకరంగా ముగించిన మనుషులూ— ఎన్నిచూశానో. ఓ హాకీ గ్రౌండ్ నిండా చిన్నపిల్లల శవాలు లెక్కలేకుండా పడివుండడం చూస్తూ ప్రక్కనుంచే ముందుకు వెళ్ళగలిగాను.

ఇవన్నీ తల్చుకుంటుంటే ఓ మనిషి పెళ్ళిలో అందం ఏమిటా అనిపిస్తోంది. మనిషి జీవితానికి అర్థం ఏమిటి? అసలిన్ని సంఘటనల్ని నడుపుతున్నదెవరు? ఆలోచనల్తో పిచ్చెక్కినట్లవుతోంది. ఖాళీగా కూర్చున్నా, చెల్లాయ్ వాళ్ళతో పేకాట ఆడుతున్నా, నాన్నతోపాటు టెన్నిస్‌కి వెళ్తున్నా యివే ఆలోచనలు. ఎలా వీటిని భరించేది? ఎవరితోనైనా చెప్పకుందామన్నా వినేవాళ్ళెవరు? నాన్నగార్కి ఆయన బిజినెస్ గొడవల్తోనే సరిపోతుంది తప్ప నాతో కూర్చుని మాట్లాడే అవకాశమే లేదు. అమ్మకసలు అర్థం కావీ సంగతులు. రాధతో చెప్పడానికి సిగ్గుపడింది మనసు.

చెల్లాయ్ నాతో బాగా చనువుగావుండేది. కాని యిప్పుడది చాలా మారిపోయింది. బెల్‌బాటమ్స్, నడుముకి వేలాడే చైన్లు, పగలూ రాత్రీకూడా పెట్టుకు తిరిగే పెద్ద పెద్ద అద్దాల గాగుల్స్ — నేనూహించలేనంతగా మారిపోయింది. మాటవరస కూడా క్రొత్తగావుంది.

ఒకరోజు సాయంత్రం గాలి దుమారంలా వచ్చింది నా రూమ్‌లోకి.

'అన్నయ్యా — యివ్వాళ్ళ మా ఫ్రెండ్ యింట్లో పార్టీవుంది. అంతా నిన్నుకూడా తీసుకురావాలని పట్టుపట్టారు. త్వరగా డ్రస్‌చేసుకో' అంటూ ఖంగారుపెట్టేసింది.

నాకు స్వతహాగా పార్టీలకి వెళ్ళాలంటే ప్రాణానికి సంకటంలా వుంటుంది. కాని యీ పార్టీలో అంతా యువతరం వాళ్ళుంటారు. నా మనసులోని బాధ అర్థంచేసుకోగల వాళ్ళుండచ్చు అనే ఆశతో బయల్దేరాను.

పార్టీలో అంతా తెల్సినవాళ్ళే — నాతో కల్సి చదువుకున్న వాళ్ళే! అంతా పెద్ద పెద్ద బిజినెస్‌మాగ్నెట్‌ల పిల్లలు. అందరిలోనూ మార్పు కనపడ్తోంది. కొంతమంది కుర్రాళ్ళు జుట్టూ, సైడ్‌లాక్స్ విపరీతంగా పెంచేశారు. కొంతమంది గడ్డాలు పెంచేసి సర్దార్లని మించిపోయారు. బెల్ బాటమ్స్‌లో, జీన్స్‌లో వింతగా తయారయ్యారు అమ్మాయిలు. అంతా గాగుల్స్ పెట్టుకునే వాళ్ళే. సిగరెట్ త్రాగనివాణ్ణి నేనొక్కణ్ణే అయ్యాను! ఒకతను డ్రింక్‌తో పాటు సిగరెట్ అందించాడు. 'సారీ—నేను సిగరెట్ త్రాగకూడదు. ఒకసారి ఆర్టిలరీ మందుడిపో పేలి గంధకం పొగ ఎక్కువగా పీల్చేశాను. అందుకని కొంతకాలం సిగరెట్ మానెయ్యమని చెప్పారు డాక్టర్' కారణం చెప్పక తప్పలేదు.

పార్టీలో అంతా ఒకదానిమీద ఒకటిగా కబుర్లు అల్లేస్తున్నారు.

'ఏ విషయాన్నయినా పెర్‌స్పెక్టివ్‌గా చూస్తేనే అర్థం అవుతుంది.' అన్నాడొకతను.

ఆ మాటల కర్థమయితే నాకు తెలియదుగాని, విషయాన్ని స్టెప్‌బైస్టెప్‌గా ఆలోచించాలి కాబోలనుకున్నాను. ఇంకొకతను మారణహోమం అంటే ఏమిటో నిర్వచించాడు. అతని మనసులో మృత్యుదేవత కూర్చుని పలికిస్తున్నట్లుగా అన్పించింది నాకు. 'బంగ్లాదేశ్‌లో ఘోరాలు చాలా జరిగినాయిగాని, వాటినన్నిటినీ మారణహోమం క్రింద జమకట్టలేం. అవన్నీ మారణహోమం అనే లెవెల్‌కి చేరుకోలేవ్' అంటాడతను.

అందరి ముఖాల్లోనూ విచారం కన్పించింది. అతని మాటలకి అంతా బాగా కదిలిపోయినట్లుగా అన్పించారు.

అంతా యుద్ధం గురించి వాళ్ళు విన్నవీ, చదివినవీ చర్చించడం మొదలు పెట్టారు. 'బజూకా, మోర్టార్' అంటూ వాళ్ళెప్పుడూ చూడని వాటి గురించి మాట్లాడేస్తున్నారు. అటాక్‌నీ—అస్సాల్ట్‌నీ ఒకటిగా చేసి చెప్తున్నారు. ధోరణి చూస్తే పెద్ద పెద్ద మాటలు వాడాలనే తహతహ

కనపడ్తోంది అందర్లో.

'అసలు యుద్ధం ఎలా చేస్తారోయ్? కిందకాల్లో కూర్చునేగా?' అడిగాడొకతను.

'అవసరాన్నిబట్టి నేలమీద ప్రాకుతూ, పరుగెత్తుతూ కూడా కాల్పులు చెయ్యాల్సొస్తుంది' అన్నాను.

'మనవాళ్లు పాకిస్తాన్‌వాళ్ల టాంక్‌లూ, విమానాలూ, ఆర్టిలరీ గన్స్ అన్నీ నాశనం చేసేశారుకదా? అప్పుడు వాళ్లేం చేసే వాళ్లు?' కుతూహలంగా అడిగిందొక అమ్మాయ్.

'అన్నీపోయినా శత్రువు ఆ చోటు వదిలి పెట్టడు. అప్పుడు ట్రెంచెస్‌లోంచి బయటకువచ్చి వాళ్ళని కాల్పులతో ఎదుర్కొనే వాళ్లం. ఒక్కోసారి గంటలు గంటలు పట్టేది వాళ్ళని తుడిచిపెట్టడానికి' బరువుగా వచ్చింది నా సమాధానం.

డిన్నర్ అయిన తర్వాత అంతా లాన్‌లో కూర్చున్నాం. నాతోపాటు చదివిన ఒకతను కవిగా మారాడట. తను వ్రాసిన ఒక కవిత చదవటం మొదలు పెట్టాడు. అదీ ఓ కవరు వెనకాల వ్రాసినట్లున్నాడు.

'బంగారు వంగదేశంలో
నీలి ఆకాశం క్రింద నెత్తురు కురు
స్తోంది.'

ఆవేశంగా పలుకుతున్నాడు పదాలు. నా కయితే నవ్వు వచ్చింది. నేను చూసిన నిజానికీ, యీ కవితకీ పొంతనలేదు. ఎన్నడూ ఆర్టిలరీగన్‌గానీ, టాంక్‌గానీ చూడనివాడు వాటిమీద కవితలల్లాడు. కవిత చాలా బరువుగా నడుస్తోంది.

# చల్లని నీడలో...

'ఏమయినా కామ్రేడ్స్ — మీ త్యాగం
వృధాకాదు,
మానవాళి ఎన్నటికీ మిమ్మల్ని మరచి
పోదు'

అంటూ ముగించాడు. అందరి ముఖాల్లోనూ బాధ అల్లుకుంది.

'నీకు నా కవిత నచ్చిందా? రియలిస్టిక్‌గా వుందికదూ?' అడిగాడు కవి.

'జరిగిన దాన్ని నువ్వు ఊహించిన తీరులో బాగానే వ్రాశావ్' అన్నాను బరువుగా.

'అంటే యదార్థంకాదనా నీవుద్దేశ్యం?' దెబ్బతిన్నట్లుగా అడిగాడు.

'నేను చూసిన నిజాలు కొన్నిచెప్తాను. దాన్నిబట్టి నువ్వే అర్థంచేసుకో' అన్నాను. అంతా సీరియస్‌గా వినడానికి తయారయారు.

'నువ్వు చెప్పిన వంగదేశంలో నీలి ఆకాశం అందాన్ని నేను చూడలేదు. కటిక చీకటిలో, నక్షత్రాలవెలుతురు తోడుగా నాకు పేరు తెలియని నదిలోకి బోటునితొయ్యడం జ్ఞాపకం వస్తోంది. అందులో అయిదుగురు పిల్లలున్నారు. అందరిలోకీ పెద్దవాడు పద్ధెనిమిదేళ్ళవాడు. వాళ్ల పని ఓ వంతెన పేల్చెయడం. ఆ వంతెనకి చేరుకోకముందో అది పేలిన తర్వాతో వాళ్ళ చావు తప్పదని నాకు తెలుసు. వాళ్ళకీ తెలుసు. మీలాగా వాళ్లెవరూ జుట్లూ, గడ్డాలూ పెంచుకో లేదు. ముఖాల్లో చావుభూపు కన్పించలేదు నాకు. ఒకింత భయం వున్నదన్నుకో వాళ్లలో. అయినా చిరునవ్వుతో ముందుకు సాగారు. పద్ధెనిమిదేళ్ల వయసులో చావుకి ఎదురు వెళ్లడం సామాన్యమైన పని కాదు'

'అబ్బ—వాళ్లనెలా పంపించ గలిగారండీ మీరు!' అందొక అమ్మాయి ఆశ్చర్యంగా.


'నేను చెయ్యగలిగింది ఏముంది అందులో — మా పోరాటంలో చాలా వూళ్లుదాటి వెళ్తుండే వాళ్లం. ఒక వూళ్లో సంగతి. ఒక్క మనిషికూడా లేడక్కడ. కాని ప్రతి యింటిముందూ ఓ పసివాణ్ణి బాయొనెట్‌మీద గుచ్చి వుంచారు. ఒకచోట ఒక స్కూల్‌లో ఆడపిల్లలందర్నీ తమ కోరికకి బలిచేసి చంపేశారు, ఓ పాకిస్తాన్ బెటాలియన్—బెటాలియన్ అంటే ఎంతమంది వుంటారో తెల్సా? దాదాపు వెయ్యిమంది. యిలాంటివి యింకెన్నో. యిదంతా మారణహోమం కాదా?' అన్నాను.

భయంభయంగా చూశారంతా.

'కవిత వ్రాయాలంటే యివన్నీ చూసి వాటిలోని తీవ్రత తెలిసివుండాలి. అప్పుడే అందులో జీవం ఉండేది' నా ఉద్దేశ్యం చెప్పాను. నిస్సహాయంగా చూశాడు నా కవి ఫ్రండ్.

శెలవులో వుండగానే నాకు అవార్డు వచ్చినట్లుగా తెల్సింది. అంతా వచ్చి అభినందనలు తెల్పారు. నిజానికి దీనికి కారణం నాతోపాటు పోరాడి మరణించిన

హరిరామ్



జవాన్లు. 'అవార్డు' ఏ సందర్భంలో యిచ్చారని అడిగారు స్నేహితులంతా. అవన్నీ తల్చుకుంటే మనసు మూగ పోతుంది. అయినా చెప్పక తప్పలేదు.

'యుద్ధం మొదలయిన మొదటి రాత్రి సంగతి. ఆరాత్రే నా కంపెనిలో తొమ్మిది మంది చనిపోయారు. ఒక అవుట్ పోస్ట్ పట్టుకోవడం నా పని. విపరీతమయిన గన్స్ కాల్పులు ఎదుర్కోవాల్సి వచ్చింది. శత్రువు బలమయిన ప్రతిఘటన చేస్తున్నాడు. వేరే ఉపాయం లేక నూటికి దిగాను నా కంపెనీతో. ఆ అవుట్‌పోస్ట్


...ఇంక ఇప్పుడు!




ఈ తలనొప్పి మాత్ర మాత్రమే కలిగి ఉంది — హెచ్చు శక్తి + రక్షణ

హెచ్చు శక్తి ఎందుకంటె, అవేదన్ ప్లస్‌లో బాధను తొలగించే అదనపు పదార్థములు ఉన్నాయి. అది త్వరితముగా, నిరపాయముగా, నిశ్చయముగా, ఉపశమనమును కలిగిస్తుంది.

రక్షణ ఎందుకంటె, అవేదన్ ప్లస్‌లో చాల కాలము వాడినా హానికరమైన చెడు ఫలితములను కలిగించే పదార్థములు ఏవీ లేవు.

**తలనొప్పి, జలుబు, ఫ్లూ, ఒంటి నొప్పి, పంటి నొప్పి మరియు బహిష్టు రోజులలో**
**అవేదన్ ప్లస్‌ను వేసుకోండి.**

మోతాదు : ఒకే ఒక బిళ్ల చాలును (నొప్పి తీవ్రముగా ఉంటే రెండు బిళ్లలు వేసుకోండి).
20 బిళ్లల కుటుంబ ప్యాకులో కూడ లభిస్తోంది.

Shilpi HPMA-2A/72 Tel

SQUIBB® SARABHAI CHEMICALS **avedan® plus**

®ఇ.ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కుకు చిహ్నం. దీని లైసెన్సుడు ఉపయోగదారులు కరంచంద్ ప్రేంచంద్ ప్రైవేట్ లిమిటెడ్.

వక్కనే మెయిన్‌రోడ్డు వుంది. కొంచెం సేపట్లో అటుగా వెళ్లే సప్లయ్ ఆపాలి. ఛాన్స్ లేదిక. 'హఠాత్తుగా శత్రువుని ఎదుర్కొందామని ప్లాన్‌వేశాను. కాని దగ్గరగా వెళ్లేసరికి అన్ని ప్రక్కల్నుంచి మెషిన్‌గన్‌లు గుళ్లవర్షం కురిపించాయి. చేతిబాంబులు సందులేకుండా పేలాయి. అయినా ముందుకు సాగాం. చివరికి బాయొనెట్లు ఉపయోగించి ఆ పోస్ట్ పట్టుకుని మావిది నెరవేర్చాం. ఆ దాడిలో నా కంపెనీలో దాదాపు సగంమంది జవాన్లు నేలకొరిగారు' అన్నాను గొంతు పూడుకుపోతుంటే.

'బాయొనెట్ ఓ మనిషిలో దిగబడిపోతే ముందుకెలా సాగుతారు?' అడిగాడొకతను.

'ఏదోవిధంగా బయటకు లాగాలి. లేకపోతే ఓ రౌండ్ కాలుస్తే ఆ షాక్‌కి అదే బయటకు వస్తుంది. యీ లోపల కొన్ని క్షణాలు వృధాకాక తప్పదు మరి.'

ఆ కొన్నిక్షణాల విలువ నాకు బాగా తెల్సు. మా సుబేదార్ మరణం మదిలో మెదిలింది. అదే చెప్పటం మొదలుపెట్టాను.

'ట్రెంచ్‌లోనుంచి కాల్పులు సాగిస్తున్నాను ఒకసారి. నా మనుషులంతా చెల్లాచెదురయిపోయారు. కంట్రోల్ పూర్తిగా లేదు. నాకు దగ్గర్లో మా సుబేదార్ వున్నాడు· దిగబడిపోయిన బాయొనెట్ బయటకులాగే ప్రయత్నంలో వున్నాడు. క్షణంలో వో పాకిస్తాన్ జవాన్ బాయొనెట్ సుబేదార్ వీపుమీద మెరిసింది· ఆ క్షణంలో కదలకూడదతను. ఆత్మరక్షణ కోసం మెరుపులా వెనక్కి తిరిగాడు. కాని అప్పటికే అతనిలో గుచ్చుకుపోయింది ఆ బాయొనెట్· నేను కాల్చిన రౌండ్‌కి ఆ జవాన్‌కూడా నేలకొరిగాడు. ప్రక్కనేవుండీ అతన్ని కాపాడలేకపోయాను.' బాధతో నిండాయి నా మాటలు.

'యివన్నీ వింటుంటే యుద్ధానికి దిగే మనిషి ఎంత కిరాతకుడా అనిపిస్తుంది' అన్నాడతను.

'ఆ సుబేదార్ కుటుంబం ఏమయ్యిందిరా పాపం?' ఆ తర్వాతొకసారి అడిగింది అమ్మ.

'యుద్ధం అయిపోయిన తర్వాత వాళ్లని కల్సుకున్నాను. అతని భార్య మన రాధకన్నా చిన్నదే. యిద్దరు పిల్లలు. అతని తల్లి గోడుమంటూ ఏడ్చింది నన్ను చూసి· 'బాబూ—మీరు ఆఫీసర్లు. నా కొడుకిలా కూలిపోయాడు — మీరే ఆదుకోవాలి మమ్మల్ని' అంటూ గొల్లుమంది. అతనికి అవార్డు వచ్చేలా వ్రాయించాను. అతని భార్యకి పెన్షన్ యిస్తారు. పిల్లలు ఎంతవరకూ చదువుకున్నా జీతంలేదు.' విలాగయితేనేం జవాబు చెప్పగలిగాను.

ఇదే చింత నన్ను పట్టుకు వేధిస్తోంది. యిరవైఏళ్ళ వయసులో విధవరాలైన ఆమె జీవితం ఏమయిపోతుంది? యిలా ఎన్నివేలమంది కుమిలిపోతున్నారీ యుద్ధం మూలంగా? యిక యీ జీవితానికి, పెళ్లికీ అర్థం, ప్రయోజనం ఏమిటి? ఇదే ఆలోచన మనసుని తినేస్తోంది. నిద్రలేకుండానే రాత్రిళ్ళు గడిచిపోతున్నాయ్. కన్నుమూస్తే బోట్‌లో పిల్లలు, బాయొనెట్ గుచ్చుకున్న సుబేదార్ అంతా కనిపిస్తున్నారు. ఏదో భయం మనసంతా ఆవరిస్తోంది.

ఒక్కోసారి పిచ్చికోరిక పుడ్తూ వుంటుంది. నాదగ్గరే గ్రెనేడ్లపెట్టె వుంటే ప్రతియింటిమీదా ఒకటి విసరాలనిపిస్తోంది. ఎక్కడో వెయ్యిమైళ్ళదూరాన జరిగిన యుద్ధం యిక్కడే, యీ వూరి వీధుల్లో జరగాలనిపిస్తోంది. నామీద నాకే అనుమానం కలుగుతోంది. ఎలా యీబాధ మరచిపోవడం? అయినా యుద్ధాలు జరగవనేమిటి? ఎక్కడో యింకో ఆఫీసర్ యిలా దాడి నడపడా? యింకో సుబేదార్ పెళ్లాం పిల్లల్ని అనాథల్నిచేసి కన్నుమూయ్యడా? యివన్నీ జరిగేవే మరి.

ఒక విషయానికీ, యింకో విషయానికీ పొంతన కుదరటంలేదు. వేషం, భాష మార్చిన చెల్లాయ్ కబుర్లు, యుద్ధం, ఆకలి అంటే ఏమిటో తెలియని కవిగారి కవితలు, బిజినెస్‌తో సతమతమయ్యే నాన్న మాటలు, రేడియోలోనూ, పేపర్లోనూ తాండవంచేస్తున్న యుద్ధం గురించిన కథలూ, బంగ్లాదేశ్‌లో మారణహోమం చూపించే సినిమాలూ — యివన్నీ నన్ను వెక్కిరిస్తున్నట్లుగా అన్పిస్తోంది. యివన్నీ ఒకే జీవనగతిలో ఎలా యిముడుతున్నాయ్? వేటికవి వేరుగా చూస్తే యదార్థాలయినవి—అన్నీ కలిసి నాలో తుఫాన్ రేపుతున్నాయ్.

యీ ఆలోచనల్తో పిచ్చెక్కేలా వుంది. మనసుకి శాంతికోసం యింతదూరం వస్తే యీ ఆలోచనలు నన్ను నిలువునా కాలుస్తున్నాయ్. వేరే దారిలేక శెలవ్ పూర్తి కాకముందే యూనిట్‌కి ప్రయాణమయ్యాను. ●

బట్టతల

జుట్టు రాలిపోతున్నదా? బట్టతల ఏర్పడుతూందా? విచారపడకండి. మా ఆయుర్వేద తైలమును వాడండి. శిరోజాలు రాలటం ఆగగలదు. వెంట్రుకలు మరల పెరుగును. ధర రు. 12. ఒక కోర్సునకు 3 సీసాలు. రు. 30.

Shyam Ayurved Bhavan,
P. O. Katri Sarai (Gaya)

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!
OBM: 2323 TEL
ఇప్పుడు
ఒక కొత్త
ప్యాక్‌లో

